# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందించే పలు కీలక నిర్ణయాలను ముఖ్యమంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు ఆమోదించారు.**

**2.** **తెలుగు భాషను పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ సమష్టి కృషి చేయాలని ప్రపంచ తెలుగు రచయితల మహాసభ పిలుపునిచ్చింది.**

**3.** **మాతృ భాష తెలుగును భవిష్యత్ తరాలకు పదిలంగా అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సూచించారు.**

**4.** **తెలంగాణాలో సంక్రాంతి నుండి రైతు భరోసా కార్యక్రమం అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.**

**5.** **నేటి యువతరానికి పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగేలా పెద్దలు ప్రోత్సహించాలని తెలంగాణా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు.**

**6.** **ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది.**

==========================

తెలంగాణాలో త్వరలో హైడ్రా పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా వార్షిక నివేదికను హైదరాబాదులో నిన్న ఆయన విడుదల చేస్తూ .... ఔటర్ రింగు రోడ్డు పరిధిలో ఉన్న చెరువులు, ప్రభుత్వ భూములను హైడ్రా కాపాడుతుందని, రెండు వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ సంస్థ పని చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రజలలో ఇప్పుడు అవగాహన పెరిగిందని ..., ఆస్తి కొనుగోలు చేసే ముందు అది ఎఫ్.టి.ఎల్. జోన్ లేదా బఫర్ జోన్‌లో ఉందా అన్న విషయం ఆలోచిస్తున్నారని రంగనాథ్ తెలిపారు.

-------------------------

ఆస్ట్రేలియాతో జరిగిన క్రికెట్ టెస్టులో అద్భుతమైన ఆట ప్రదర్శించి సెంచరీ సాధించిన నితీశ్ కుమార్ రెడ్డిని ఆంధ్ర ప్రదేశ్ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన రెడ్డి ఒక ప్రకటనలో ప్రశంసించారు. ఆయన విజయం దేశం మొత్తానికి గర్వకారణమని ..., నితీశ్ కుమార్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్షించారు.

-------------------------

భారత – ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన నితీశ్ కుమార్ రెడ్డి అద్భుతంగా ఆడి సెంచరీ చేసినందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. నేటి యువతకు నితీశ్ కుమార్ రెడ్డి ఆట స్ఫూర్తిగా నిలుస్తుందని ..., భవిష్యత్‌లో ఆయన మరిన్ని పరుగులు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని...., భారత దేశ కీర్తి, ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఆకాంక్షిస్తున్నట్టు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ... నితీశ్ కుమార్ రెడ్డి చూపిన ప్రతిభా పాటవాలను ప్రశంసిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ....ఎసిఎ.... 25 లక్షల రూపాయల నగదు బహుమతి ప్రకటించింది.

---------------------------

తెలంగాణా రాష్ట్ర అసెంబ్లీ రేపు ప్రత్యేకంగా సమావేశమవుతుంది. ఈ సందర్భంగా ఈ నెల 26వ తేదీన కన్ను మూసిన భారత మాజీ ప్రధాన మంత్రి ...., ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అసెంబ్లీ నివాళు లర్పిస్తుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉత్తమ పోలీసు సేవలు తమ లక్ష్యమని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... పోలీసు సేవల కోసం డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తామని చెప్పారు. గత ఏడాది కంటే ఈ సారి అనేక కేసులలో పురోగతి సాధించామని., రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు ఒక సైబర్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించామని ద్వారకా తిరుమల రావు వివరిస్తూ .....

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

నేటి యువతరానికి పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగేలా పెద్దలు ప్రోత్సహించాలని తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపు నిచ్చారు. హైదరాబాదులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను నిన్న ఆయన సందర్శించి మాట్లాడుతూ .... పుస్తకాలలో అనంతమైన జ్ఞానం ఉందని ..., పుస్తకాలను ప్రతి ఒక్కరూ సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు. ఏవైనా శుభకార్యాలకు వెళ్ళినపుడు ప్రజలు పుష్పగుచ్ఛాలకు బదులు మంచి పుస్తకాలను బహుమతిగా ఇవ్వాలని సూచించారు. ఈ– పుస్తకాలలో కంటే మామూలు పుస్తకాలలోనే ఎక్కువ విజ్ఞానం ఇమిడి ఉంటుందని ..., పుస్తకాలు చదువుతుంటే ఆయా రచయితలతో నేరుగా మాట్లాడుతున్న అనుభూతి కలుగుతుందని జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు.

---------------------------

విధి నిర్వహణలో ఉన్న అన్నమయ్య జిల్లా గాలివీడు ఎం.పి.డి.ఓ. జవహర్ బాబుపై కొందరు దుండగులు జరిపిన దాడిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ దాడిలో గాయపడి ప్రస్తుతం కడప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పవన్ కళ్యాణ్ నిన్న పరామర్శించారు. ఎం.పి. డి.ఓ. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని...., దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో సంక్రాంతి పండుగ నుండి రైతు భరోసా కార్యక్రమం ప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. హైదరాబాదులో నిన్న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రైతు భరోసా కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .... సాగు చేసే భూమికే పెట్టుబడి సహాయం ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని, వ్యవసాయ శాఖ అధికారుల వద్ద రైతుల పేర్ల నమోదు కార్యక్రమం జరుగుతోందని, ఈ కార్యక్రమం అమలులో ఖచ్చితత్వం కోసం ఉపగ్రహ సమాచారం వినియోగిస్తామని చెప్పారు. గ్రామాలు ..., సర్వే నంబర్ల వారీగా సాగు వివరాలు సేకరిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

మన మాతృ భాష తెలుగును భవిష్యత్ తరాలకు పదిలంగా అందించాలని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. ప్రపంచ తెలుగు రచయితల మహా సభలు జరుగుతున్న సందర్భంగా ఆయన ట్విట్టర్ మాధ్యమంలో ఆయన ఈ విషయం పేర్కొంటూ .... విజయవాడలో ఈ సభలు జరగడం తెలుగు వారందరికీ ఎంతైనా గర్వకారణమని అన్నారు. మహా సభలకు హాజరైన అతిథులు..., భాషాభిమానులకు ధన్య వాదాలు తెలియజేస్తున్నానని...., మహా సభలు జరుగుతున్న ప్రాంగణానికి తెలుగు జాతి కోసం అద్వితీయ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టడం అభినందనీయమని అన్నారు. తెలుగు మహా సభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

---------------------------

తెలుగు పాలనా భాష కావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ....,.ఆంధ్రప్రదేశ్ అవనిగడ్డ శాసన సభా నియోజక వర్గ సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఆకాక్షించారు. విజయవాడ నగరంలో నిన్న ప్రపంచ తెలుగు రచయితల మహా సభలు ప్రారంభమైన సందర్భంగా ఆయన స్వాగతోపన్యాసం ఇస్తూ .... తెలుగు భాషను ఏ విధంగా పరిరక్షించుకోవాలో అందరూ కలిసి కూర్చుని ఆలోచించుకోవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. యునెస్కో చేసిన సూచనకు అనుగుణంగా రూపొందించిన జాతీయ విద్యావిధానాన్ని తెలుగు ప్రభుత్వాలు అనుసరించాలని అందరూ కోరుతున్నారని...., తెలుగు భాషకు..., తెలుగు జాతికి వికాసాన్ని తీసుకు రావడానికి అందరూ కృషి చేయాలని మండలి బుద్ధ ప్రసాద్ సూచిస్తూ ......

..వాయిస్...22 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు 108 వాహనాలను కొత్తగా 190 వరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అమరావతిలో నిన్న జరిగిన వైద్య ..., ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. వైద్య ... ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్త వాహనాల కొనుగోలు కోసం అరవై కోట్ల రూపాయల మేర వ్యయం కానున్నది. ఆస్పత్రులలో పేదలు మరణించిన పక్షంలో వారి మృత దేహాలను తరలించే మహాప్రస్థానం వాహనాల సంఖ్యను కూడా పెంచాలని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఎన్.టి.ఆర్. బీమా విధానానికి సంబంధించి రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించే పథకం అమలుచేయాలని కూడా నిర్ణయించారు. అంతేకాకుండా ... గ్రామాలలో వైద్య సేవలు అందించేందుకు 104 అంబులెన్స్‌ల వ్యవస్థను తిరిగి బలోపేతం చేయాలని, పలు రకాల వైద్య పరీక్షలు చేసే సౌకర్యాన్ని మరలా కల్పించాలని కూడా చంద్రబాబు నాయుడు ఈ సమావేశంలో నిర్ణయించారు.

======================